# మిస్టేక్

-ముచ్చర్ల రజనీ శకుంతల

ఓల్డ్‌మోడల్ బ్లాక్‌కలర్ అంబాసిడర్ కారు నల్లటి తారురోడ్డు మీద పాములా మెలికలు తిరుగుతూ వెళ్తోంది.

డిసెంబర్ నెల... స్వెట్టర్ వేసుకున్నా తలకు మఫ్లర్ చుట్టుకున్న కౌశిక్ చేతులు స్టీరింగ్ మీద అదుపు తప్పేంతగా వణుకుతున్నాయి.

రోడ్డుకు ఇరువైపులా దట్టమైన అడవి. కారు హెడ్‌లైట్ల వెలుతురులో రోడ్డు ఒళ్ళు విరుచుకుంటోన్న దెయ్యంలా కనిపిస్తోంది. అతని పెదవుల మధ్య చితి మంటలా సిగరెట్ కాలుతోంది.

అంత చలిలోనూ కౌశిక్ ఒళ్లంతా చెమట... అతని గుండె చప్పుడు అతనికే స్పష్టంగా వినిపిస్తోంది.

డిక్కీలో తన భార్య శవం వుంది.

అవును...శాశ్వత నిద్రలో విశ్రాంతి తీసుకుంటోంది. తనే చంపాడు. కత్తితో పొడిచి చంపాడు. తనిప్పుడు తన భార్య శవాన్ని ఏం చేయాలి? లోయలోకి విసిరేయాలి. ఆనవాళ్ళు గుర్తు పట్టకుండా చేయాలి.

అతనికి తన భార్య సుశీల గుర్తొచ్చింది. ఎంత అందంగా వుంటుంది,

ఎంత వినయంగా కనిపిస్తుంది. నటన... అంతా నటన... లేకపోతే తనను ఏమార్చి మరొకరితో... ఛ...తల విదిల్చాడు కౌశిక్.

సరిగ్గా మూడు గంటల క్రితం తనకు ఎదురొచ్చి మీకో శుభవార్త చెప్పబోతున్నానని చెప్పి, తననెంతగా మోసం చేసింది! తనెంత పిచ్చిగా నమ్మాడు. సరిగ్గా మూడు గంటల క్రితం ఏం జరిగింది?

***

కౌశిక్ ఇంట్లోకి అడుగు పెట్టడంతోనే పరుగున వచ్చి వాటేసుకుంది సుశీల.

పదిహేనురోజులుగా క్యాంపు పేరుతో వెళ్లొచ్చిన భర్త అన్ని రోజులుగా తనకు దూరంగా ఉండడంతో మానసికంగానూ, శారీరకంగానూ తట్టుకోలేనట్టుంది.

ఓసారి భార్యవంక చూసాడు.

అమాయకంగా కనిపించింది. అందంగా కూడా కనిపించింది. తల నిండా మల్లెపూలు. ఏ పౌడర్ వాడకున్నా బుగ్గల్లో నునుపుదనం, పెర్ఫ్యూమ్ ఉపయోగించకపోయినా ఆ తాలూకు మత్తయిన సుగంధం.

ఒక్క క్షణం అలాగే భార్యను దగ్గరకు తీసుకున్నాడు. అప్రయత్నంగా అతని చేయి ఆమె నడుమును చుట్టేసింది.

ఆమె నడుం ఒంపు తగలగానే అతనిలో రక్తం వేగంగా పంప్ అవుతున్న ఫీలింగ్. ఆ చేయి అలా తిరిగి పొట్టపైకి వెళ్లింది. పలుచటి పొట్ట అతని చేతికి మెత్తని ఫోమ్‌లా తగిలింది.

తన చేతిలోని బ్రీఫ్‌కేస్ అలాగే వదిలి భార్యను మంచంపైకి నెట్టాడు. అలాగే వెల్లకిలా పడ్డంతో ఆమె చీరకొంగు స్థానభ్రంశం చెందింది. ఆమె నాభి, పలుచటి పొట్ట, అతనిలో వాంఛను ప్రోది చేసాయి.

అతని చేతి వేళ్ళు ఆమె చీర కుచ్చెళ్ళపైకి వెళ్లాయి.

ఆమె కళ్ళు అరమోడ్పులయ్యాయి. భర్త చర్యలను ఆమె ప్రతిఘటించలేదు. ఆస్వాదిస్తోంది. రెండే రెండు నిముషాల్లో నిపుణుడైన సర్జన్‌లా అతను ఆమె దుస్తులను ఒంటి నుంచి అవలీలగా తీసి పారేసాడు.

సమయా సమయ నిబంధన మరచి ఆదమరచి ఆమె శరీరాన్ని అతను ఆక్రమించుకుంటున్నాడు.

పదిహేను నిముషాల తరువాత అతను ఆమె నుంచి విడివడ్డాడు. ఆమెకు శరీరం గాలిలో తేలిపోతున్నట్లు వుంది. అతని శరీరమంతా స్వేదం అలుముకుంది.

అలాగే భర్తను దగ్గరకు లాక్కుని కరచి పట్టుకుంది.

"సుశీ! లేచి స్నానంచేసి ఫ్రెషప్ అవ్వు. ఈలోగా ఓ అయిదు నిముషాలు రెస్ట్ తీసుకుంటాను. ఆ తరువాత నేను ఫ్రెషప్ అయ్యేక అలా బయటకు వెళ్లొద్దాం" అన్నాడు కౌశిక్.

"సరే...అన్నట్లు మీకో శుభవార్త. ఈ వార్త చెబితే మీరు ఈ ప్రపంచంలోనే ఉండరు" అంది సుశీల.

"ముందు స్నానం చేసిరా" అన్నాడు కౌశిక్.

'మీరు కూడా రాకూడదు' మనసులో స్వగతంలా అనుకుంది సుశీల.

ఆ తరువాత టవల్ తీసుకుని బాత్రూంలోకి నడిచింది.

***

భార్య బాత్రూంలోకి వెళ్లగానే సిగరెట్ వెలిగించి ఆలోచిస్తూ ఉండిపోయాడు. అతను డిస్ట్రబ్డ్‌గానే వున్నాడు.

రెండురోజుల క్రితం అతనికో శాడ్ న్యూస్ తెలిసింది. తన స్నేహితుడ్ని అతని భార్య చంపేసింది తన ప్రియుడి సాయంతో.

తమ మధ్యనున్న అక్రమ సంబంధాన్ని పసిగట్టాడన్న భయంతో భర్తను చంపేసింది. అతనికి తలంతా దిమ్ముగా వుంది.

తన స్నేహితుడూ తనలాగే తరచూ క్యాంపులకు వెళ్తూ వుంటాడు. అతనలా ఆలోచిస్తూ ఉండగానే సెల్‌ఫోన్ మోగింది. అది తన భార్యది.

తనే భార్యకి కొనిచ్చాడు. తను క్యాంపుల్లో వున్నప్పుడు భార్యతో మాట్లాడే సౌలభ్యం కోసం కొన్నాడు.

తను ఇక్కడ ఉండగా తన భార్యకు ఫోన్ ఎవరు చేస్తారు? ఈ నెంబర్ తనకు తప్ప ఎవరికీ తెలియదు.

ఓ చిన్న అనుమానం. వెళ్లి సెల్‌ఫోన్ ఓకే బటన్ నొక్కి ఫోన్ చెవి దగ్గరపెట్టుకున్నాడు.

"హలో... సరూ! మీ ఆయన వచ్చి వుంటాడు కదూ. నువ్వేం మాట్లాడకు. మనం అనుకున్న ప్రకారమే అతడ్ని నువ్వు నీ ప్రేమ మత్తులోముంచే సావు కదా. పాయసంలో విషం కలిపావా? ఈ రాత్రికే ఫినిష్. తర్వాత మనిద్దరం... వింటున్నావా? మరోరెండు గంటల్లో నేను అక్కడుంటాను. ఆ తరు

వాత కత్తితో కసక్...'' ఫోన్ పెట్టేసాడు ఆవతలి వ్యక్తి.

కౌశిక్ మొహం చెమటతో తడిసిపోయింది. ఈసారి భయంతో, కోపంతో, కంగారుతో చెమట పట్టింది.

అతని పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి.

బాత్రూం తలుపు తెరుచుకుంటున్న శబ్దం.

మెల్లగా సెల్‌ఫోన్‌ను యధాప్రకారంగా పెట్టేసాడు.



"సెల్ మోగిందా...?'' అడిగింది భర్తను.

"లేదే. అయినా నేను ఇక్కడ ఉండగా నీకు సెల్ ఎవరు చేస్తారు?''

"అవునవును'' అంది సుశీల.

ఆ మాటల్లో అతను ఆమె తడబాటును వెతికాడు.

★★★

"మీ కోసం స్వీట్ చేసాను. తరువాత బయటకు వెళ్దాం'' అంటూ సుశీల కిచెన్‌వైపు వెళ్లింది.

'స్వీట్...' కౌశిక్ క్రూరంగా నవ్వుకున్నాడు. అప్పటికే అతనో నిర్ణయానికి వచ్చాడు. భార్య తనని చంపకముందే తనే భార్యను చంపాలి. అతని దృష్టి టీపాయ్ మీదున్న యాపిల్ కోసే కత్తి మీద పడింది.

మెల్లగా టీపాయ్ దగ్గరికి వెళ్లి ఆ కత్తిని చేతిలోకి తీసుకున్నాడు.

సుశీల కిచెన్ లోంచి వచ్చింది.



## కితాబులు

మణిరత్నం బొంబాయి, దిల్‌సే చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించి తానెక్కడ ఉంటే అక్కడ సంచలనం రేకెత్తించిన మనీషా కొయిరాలా తన అభిమాన దర్శకుల గురించి తెగ చెబుతోంది. 'తారల జీవితాన్ని మలుపు తిప్పేవి కొన్నిచిత్రాలైతే ఆ చిత్రాలకి మంచి పేరు తెచ్చేది దర్శకులే. నేను అమితంగా అభిమానించే దర్శకుల్లో మణిరత్నం, భన్సాలీ ముఖ్యమైనవారు' అంటోంది మనీషా. అన్నట్టు ఇంది రాగాంధీ చిత్రంలో నటిస్తున్న మనీషా ఈ చిత్రం త్వరలో పూర్తవుతుందని, ఈ చిత్రం కోసం నా ముఖంలో ఎలాంటి మార్పులు చేసుకోవడం లేదని చెబుతోంది.

"ఇదిగోండి" అంది భర్త చేతికి స్వీట్ ప్లేట్ ఇస్తూ.

"నువ్వూ..."

"ఊహూ..." గారంగా అంది సుశీల.

అప్పుడు బరస్ట్ అయ్యాడు కౌశిక్.

"ఎంత పనిచేసావే. మొగుడ్నే చంపడానికి సిద్ధ పడ్డావా?" కోపంగా అంటూ ప్లేట్ విసిరికొట్టాడు.

సుశీల బిత్తరపోయింది. కంగారుగా, భయంగా భర్తవైపు చూసింది.

"నటించింది చాలు. అంతా తెలిసింది. ఇదేనా నువ్వు నాకు చెప్పాలనుకున్న శుభవార్త"

సుశీల ఏదో చెప్పాలని టీపాయ్ మీదనున్న ఫైల్ తీసింది. అప్పటికే ఆమెకేమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆమె నోరు నొక్కి తన చేతిలోవున్న కత్తితో ఇందాక తను ఆడుకున్న ఆ పలుచటి పొట్ట మీద కత్తితో కసిగా పొడిచాడు.

ఒకటి...రెండు... మూడు.. కాసేపట్లో సుశీల గిలగిల కొట్టుకుంటూ అచేతనమైంది. అయినా కౌశిక్ కసి చల్లారలేదు.

***

తన భార్య ప్రియుడిని కూడా చంపాలి. అతని కోసం ఎదురుచూసాడు. రెండు గంటలు గడిచింది.


అయినా రాలేదు. ముందు భార్య శవాన్ని ఇక్కడ్నించి తరలించాలి. ఘాట్‌రోడ్ దాటేక లోయలో ఈ శవాన్ని విసిరేయాలి. ఆ తరువాత తన భార్య ప్రియుడ్నికూడా ఇలాగే చంపి లోయలోకి విసిరేయాలి.

కౌశిక్ భార్య శవాన్ని వెనుక డిక్కీలో పెట్టాడు. టీపాయ్‌మీద సెల్‌ఫోన్... దాన్ని విసిరికొట్టాలన్నంత కసి పెరిగింది.

కానీ అంతలోనే ఒకవేళ తన భార్యకి ప్రియుడు ఫోన్ చేస్తే వాడ్ని ఇక్కడికి రప్పించి చంపేందుకు ఈ సెల్ ఉపయోగపడుతుంది అనుకుని ఆ సెల్‌ను తనతోపాటే వుంచుకున్నాడు. ఆలోచనల్లోంచి బయటకు వచ్చాడు.

తన భార్యకు ఆమె ప్రియుడు ఫోన్‌చేసి మూడు గంటలు దాటింది. కారు ఘాట్‌రోడ్డు మీదకు వస్తోంది.

చాలా కేర్‌ఫుల్‌గా డ్రైవ్ చేయాలి... అనుకుంటూ ఉండగానే సెల్ మోగింది. ఒకే బటన్ ప్రెస్ చేసాడు.




"సుషీ...సుష్మా! నేనే కపర్దిని. మీ ఆయన్ని పైకి పంపించేసాను. పాయసం అవసరం లేకుండానే. నేనిక్కడే ఘాట్‌రోడ్డు దగ్గర మనం ఎప్పుడూ కలుసుకునే ప్లేసులో వుంటాను. మొత్తం అన్నీ సర్దుకుని వచ్చేయ్. మీ ఆయన్ని లోయలోకి విసిరేసాను. వింటున్నావా... బై!"

కౌశిక్ తల గిర్రున తిరిగిపోయింది. సుష్మ... సుశీ...అంటే ఆ అగంతకుడు తన భార్య ప్రియుడు కాదా? అది రాంగ్ కాలా? సడెన్‌బ్రేక్‌తో కారాపాడు.

కిందకి దిగి డిక్కీ దగ్గరకు పరుగెత్తి డిక్కీ ఓపెన్ చేసాడు. భార్య శవంవైపు చూసాడు. ఆ కళ్ళు ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాయి. ఆమె కుడిచేతిలో ఫైల్... ఆ ఫైల్ గట్టిగా లాగి ఓపెన్ చేసాడు. సుశీల ప్రెగ్నెన్సీ కన్‌ఫర్మ్‌చేస్తూ ఆమెకు మూడవ నెల అని డాక్టర్ ఇచ్చిన రిపోర్టు. తనకు చెబుతానన్న శుభవార్త ఇదా? రక్తంతో తడిసిన ఆమె పొట్టవైపు చూసాడు. తను ప్రేమతో ఆడుకున్న పొట్ట, తనకిష్టమైన నడుం, తను తన భార్యనే కాదు, కడుపులో వున్న తన బిడ్డనూ హత్య చేసాడు.

మొహాన్ని రెండు చేతుల్లో పెట్టుకుని రోదిస్తున్నాడు. అతనో నిర్ణయానికి వచ్చేసాడు. సుశీల శవాన్ని తీసి పక్కనే పెట్టుకున్నాడు.

కారు స్పీడుగా డ్రైవ్ చేస్తున్నాడు. పక్కన అతని భార్య శవం వుంది. ఆమె తలను తన ఒడిలో పెట్టుకున్నాడు. 'సుశీ... నిన్ను చంపిన నేనూ నీతోపాటు ఛస్తాను. నువ్వూ నేనూ, కడుపులో వున్న మన బిడ్డ...' యాక్సిలేటర్‌ని బలంగా తొక్కాడు. ఘాట్ రోడ్డులో మలుపులు తిరుగుతూ వేగంగా వెళ్తోంది కారు. ఎదురుగా పెద్ద లోయ. లోయవైపే వేగంగా వెళ్తోంది.

***

కపర్ది, సుష్మ లోయ దగ్గర కలుసుకున్నారు. ఆమె చేతిలో భర్త తాలూకు ఆస్తి వున్న సూట్‌కేసు వుంది. కొద్దిసేపటి క్రితమే ఇదే లోయలో భర్త శవం అగాధంలోకి పడిపోయింది. దూరంగా ఎక్కడికైనా వెళ్లిపోవాలని ఆ ఇద్దరూ నిర్ణయించుకున్నారు.

సరిగ్గా అప్పుడే కౌశిక్ కారు అదుపు తప్పి లోయలోకి పడిపోయింది కపర్దిని, సుష్మని ఢీకొట్టి.

ఆ వేగానికి ఆ కారుతోసహా కపర్ది, సుష్మలు కూడా లోయలోకి పడిపోయారు. వాళ్ల ప్రాణాలు ఎప్పుడో గాలిలో కలిసిపోయాయి. ఒక చిన్న మిస్టేక్! కౌశిక్‌కు భార్యను, కడుపులోని బిడ్డను దూరం చేసింది. ఒక అక్రమ సంబంధం మిస్టేక్ సుష్మ భర్త చావుకు కారణమైంది. అదే మిస్టేక్ కౌశిక్ తనను తాను చంపుకుని తన భార్యాబిడ్డలతోపాటు చావడానికి కారణమైంది. సేమ్ మిస్టేక్ కపర్దిని, సుష్మను బలి తీసుకుంది. ఒకే ఒక మిస్టేక్ ఆరుగురి పాలిట డెత్ సెంటెన్స్ అయింది.

★